# తానా ప్రపంచ సాహిత్య వేదిక

## ప్రపంచ ఫోటోగ్రఫీ దినోత్సవ ( ఆగష్టు 19) కవితల పోటీ విజేతలు

**<u>ప్రథమ బహుమతి రు. 30,000 లు పొందిన కవిత":</u>** **బండ్ల మాధవరావు, విజయవాడ, ఆంధ్రప్రదేశ్**

**"పొలేలుగా"**

అక్కడ వాళ్లు నగరాన్ని తూర్పారపడుతున్నారు
మట్టికి మనిషికి దూరమైన వలసల్లోంచి
పొల్లు పొట్టు పోగా మిగిలే గట్టి మనిషి కోసం
ఆకలిని రాసిపోసి తలా ఓ పిడికెడు పంచడం కోసం
చెమటచుక్కల్లోంచి మొలిచిన అన్నం
కాంక్రీటు వనాలకు ఎరువుగా చల్లడం కోసం

చేటల్లోంచి జారుతున్న జీవితాలు
చిరిగిన దేహాలకు అతుకులు పెట్టలేవు
డొల్ల బ్రతుకుల్లోంచి తొంగిచూసే
నిర్జీవ పక్షులు రెండు గింజల్ని కూడా ముక్కున కరుచుకోలేవు
పొలాల సమాధుల్లోంచి మొలిచే విత్తనమేదీ
నగరపు రహదారుల్లో పరుచుకోదు
భవనాల సమూహాల్లో తలదాచుకొనే
శ్రమచేతులు జీవితాల్ని ఎత్తిపట్టి
'పొలేలుగా' అని గాలిని ఆహ్వానిస్తున్నాయి
డాంబర్ రోడ్లపై పరిచిన తలపాగాలోకి
ఎవడూ ఓ పిడికెడు పచ్చదనాన్ని విసరడం లేదు
వాడుమాత్రం తన చేతుల్నే అన్నం గా మలిచి
నగరపు ఆకలిపై చల్లుకుంటూ వెళుతున్నాడు

---

**<u>ద్వితీయ బహుమతి రు. 20,000 లు పొందిన కవిత":</u>** **సింధు రావులపాటి, కమ్మింగ్, జార్జియా, అమెరికా**

నింగికి చిల్లులు పడి వాన రాలినట్లు

వాడి పాదాలకు గాయాలయి

తినే గింజలు రాలుతాయి...

వాడి తూర్పారలో ఆకలి తాలు అయి

నేనున్న కాంక్రీటు జంగిల్ కి కొట్టుకు వస్తుంది.

అయినా ఒళ్ళంతా మట్టి పులుముకున్న వాడి ఆహార్యాన్ని

పశుపక్షాదుల తో రోజంతా చేసే వాడి సహచర్యాన్ని

ఓ  జీవిత కాలం అంతా చీదరించు కుంటూనే వున్నా..

నాణానికి రెండో వైపు చూడటం నాణ్యమైన చూపు కదా !

అందుకే వాడి గూర్చి ఆలోచనాలోచనాల తో చూస్తే,

నిఖార్సైన మనిషికి నిలువెత్తు అద్దం లా కనపడ్డాడు..

చదువురానోడు అంటారు గాని

ఆలోచనంతా అక్షర లిఖితమే.

రాశి చూసి చెబితే పంటెంతో లెక్కతేలినట్టే..

కోనరేసి దున్నితే కోణాన్ని కొలిచి చూసినట్టే..

నడిచే ప్రయోగశాల పై నా కెప్పటికీ చిన్న చూపే..

ఆటవిక జీవనం నుండి సాంఘీక జీవనం లోకి

మనిషి మనుగడ మారిన పరిణామ క్రమంలో

ఉత్పత్తి వాదానికి ఊతమిచ్చిన

ఊపిరి తిత్తి వాడు.

వెతుక్కుంటే వెళితే నామూలాలు వాడి పాదాలక్రింద

మూల్గుతూ కనిపిస్తాయి..

నీటి చాలును వెతికి పట్టిన నోటి గింజను,

పుడమి తల్లికి పురుడు పోసిన తూర్పు సంధ్యను

ఎర్ర బస్సెక్కే ఏగాని గానే చూశానే కానీ

ఒక్క నాడైనా ఆ మట్టి హృదయాన్ని

ఆర్తిగా ఆలింగనం చేసుకోలేదు..

రూకలు తిన లేని నా నోటికి

నూకలు అందించే ఆ చేతిని తల్చుకొని

వాడికి నేనేమౌతానన్న ప్రశ్న

బోరుబావి లా గుండెను తొలుస్తూ పోతుంటే

ఉబికి వచ్చే నెత్తురు తడి తో

అతని పాదాలపై పారాణి పెట్టాలనిపిస్తోంది..

ఇప్పటి నా కిమ్ కర్తవ్యం,

అత్తరు సీసాను ఆవలకు విసిరేసి

ప్రేమగా పెండతట్టను తల కెత్తు కోవడమే....

---

**<u>ప్రత్యేక ప్రశంస - రు. 4,000 ల బహుమతి పొందిన కవిత”:</u>** డి.నాగజ్యోతిశేఖర్, మురమళ్ల. తూర్పు గోదావరి జిల్లా

“ఒకానొక పురాతన స్వరం”!

నేనో ఆకుపచ్చని పాటను ఎత్తుకొని...

వీధుల్లో నడిచిపోతున్నాను.!

ఇరుకు సందుల్లో బువ్వల నవ్వుల్ని

విసిరేస్తూ....

నెత్తుటి పాదాలతో నడిచిపోతున్నాను!

గడప గడపకూ విస్తరి వేస్తూ...

ఆకలి నోళ్ళలో ఆయువుపోస్తూ...

డొక్కలంటిన పేగులతో

అప్పుల పొద్దుల్లోకి కూరుకుపోతున్నాను!

పచ్చని పాటను దించేందుకో

వెచ్చనిబాట దొరక్క...

మట్టి కాళ్లకు నగ్నత్వాన్ని తొడుక్కొని

పొగుబడ్డ బతుకు బస్తీల మధ్య నుండి సాగిపోతున్నా!

రెక్కల చేటల్లో విరిగిన బతుకును చెరుగుతూ...

చెమట చుక్కల్ని ధాన్యపు రాశిగా పోస్తూ....

ఒంటరి పాటను  మోస్తూ...

పడమటి ఇంటికి వలసపోతున్నాను!

పట్టణీకరణ పాదాల కింద నలుగుతూ....

మట్టి మరణాన్ని వొట్టిపోయిన వేళ్ళతో తడుముతూ...

పైరు పాటను హత్తుకునే

పొలంపొత్తిళ్ళను పిలుస్తూ

పురాతన స్వరమై పూడుకుపోతున్నా!

కిక్కిరిసిన మీ అభివృద్ధిఇళ్ల మధ్య

గుప్పెడు మట్టి తడి కనిపిస్తే

చెబుతారా!

లోకం ఆకలి తీర్చే సేద్యపు పాటొకటి నాటి వెళతా!

ఎన్నటికీ వాడని మట్టిచిగుళ్ల

గేయమొకటి మీటి పోతా!

గ్రామ సమాధిని బద్దలుకొట్టి

మనిషి ఇళ్లకు విపేచనా విమోచనం కలిగిస్తా!

ఇకనైనా...

పుడమి పాడే ఆకుపచ్చ పాట

నెత్తుకొని

ఇరువురమూ నవీనస్వరం కలుపుదాం రా!

ఆలోచనల్ని తూర్పారబట్టుకొని

బంగరు వరిరాశై పల్లె కళ్ళెంలో

నర్తిద్దాం రా!

**ప్రత్యేక ప్రశంస - రు. 4,000 ల బహుమతి పొందిన కవిత":** **తండ హరీష్ గౌడ్, గూడూరు, మహబూబాబాద్, తెలంగాణ**

.~గాలిపటపు దారాలు~

నాకళ్ళకు వెలుగునిచ్చే కిరణాలను
చెరుగుతున్నట్టుగా ఉంది
నా ముక్కుపుటలకు
బతుకుయుద్ధపు వాసనొస్తుంది

మేఘమొక గడ్డిపోచకు ప్రాణం పోసినట్టు
నీడలాంటి ఆకృతుల్లో సేదతీరుస్తున్నట్టు
ఏకాంతవర్షమొకటి పట్నపు ఇళ్ళపై
బలంగా కురిసినట్టుగా ఉంది

పల్లెల్లోని కాంతినంతా ఓ దగ్గర కుప్పపోసి
అన్ని దిక్కుల్లోకి పంచటానికి
అందరి తలపుల తలుపుల్లోకి
హైవే రోడ్డు వేస్తూ
ఖరీదైన భవంతుల్లో
శ్రామిక సూర్యుళ్ళై నిలబడ్డట్టుగా ఉంది

అందరినీ ఆకాశానికెక్కిస్తూ
ఎత్తైన పట్నపుఇళ్ళకొనలపై చిక్కుకునే
గాలిపటపు దారాలు వీళ్ళు
రోజూ సాయంత్రం,వాళ్ళు వాళ్ళుగా మరణిస్తూ
పొద్దున్నే ఎవరికోసమో ఉదయించటం
వాళ్ళకు అలవాటే

**<u>ప్రత్యేక ప్రశంస - రు. 4,000 ల బహుమతి పొందిన కవిత":</u>** **జయశ్రీ మువ్వా, ఖమ్మం, తెలంగాణ.**

**తూర్పారా//**

వాలేపొద్దు ముక్కలుగా స్వప్నాలకి నీరెండపడుతుంది

నువ్వొదులుకున్న నేల వీలునామా రాసుకుంటుంది

నీ మూలాలని ముడుపు కట్టే వుంచుతుంది.

శిశిర హార్మ్యాల నడుమ చిరుగుచివురలకై వెంపర్లాటలో

గాలివాటున తెగిన గాలిపటాలు జీవితాలు

అక్కడ మడిలో దూకిన చంద్రుడు బురదకి వెన్నెల పూసిపోతున్నాడు

ఇక్కడ అదేమీ పట్టని రాత్రి పేజీకి ఎర్రర్ , లైఫ్24/7 గస్తీ కాస్తుంది

కాక్టస్ లాంతరులో విరిగిన వెలుతుని గూగుల్ మాప్ తో వెతుకులాట ఆపి

ఖాళీ అయిపోయి అయినా ఓ సారి సొంతూరికి వచ్చి చూడరాదూ ఏమీలేనితనం ఎంతబావుంటుందో..

కంటి నలుసుకి అమ్మ కొంగు పట్టిన ఆయంత హాయిగా..

ఫ్రీజ్ అయిపోయిన గుండెలమీద చెయ్యిపెట్టి తడిమి చూడు, తల్లి నేల తడి చెలమూరదూ?

మాటల్ని మింగిన కీబోర్డ్ తో నవ్వు చచ్చిన నగరవీధిలో తాలు బతుకులు ఎన్నాళ్ళు?

నీకై నువ్వు తూర్పారబెట్టుకురా కొత్తగా మొలకెత్తడానికి.

నీలో నువ్వు తప్పిపోయాక ఊపిరాడని నిదురలో నిజంకల ఒకటొస్తుంది

నువ్వు మళ్ళీ పుట్టే బొడ్డుతాడు కన్నవూరు.

---

**<u>ప్రత్యేక ప్రశంస - రు. 4,000 ల బహుమతి పొందిన కవిత":</u>** **-పాయల మురళీకృష్ణ, విజయనగరం, ఆంధ్రప్రదేశ్**

"కొన్ని చేతులు"

కొన్ని చేతులంతే

చిందిన స్వేదంలో హరితకాసారాలను కలగంటాయి

హోరుగాలిలో ఎత్తిన చేటలవుతాయి

ఆకలి కంచాల్లో వెన్నెల వెలుగు లీనే గట్టిగింజల్ని కురిపిస్తాయి

ఎప్పుడో తమ ఉనికిని మరచిపోయిన లోకాన్ని మరచిపోకుండా

మట్టిని పిసుకుతూనే వుంటాయి

లాభనష్టాల బేరీజుల్ని కాళ్ళకంటిన బురదలా కడిగేస్తాయి

రేపటిలోకి ఆశవీడని ముఖచిత్రాలై ప్రయాణిస్తాయి

కొన్ని చేతులంతే

నగరాన్ని అద్దంలా తీర్చిదిద్దుతాయి

పెద్దపెద్ద ఫ్లైవోవర్లకు తమ వెన్నెముకలు దన్ను పెట్టి

విశాలమైన రహదారుల కోసం

మరిగే తారుకు తమ నల్లని దేహపు జిగుమానాన్ని జతచేస్తాయి

నెత్తురు గడ్డకట్టేలా నిర్మించిన కట్టడాలు దించిన చుక్కల్ని

సిమెంటు సావాసాల చర్మం పై ధరిస్తాయి

చితికిన వేళ్ళ నుండి  స్రవించిన దృఢత్వాన్ని పునాది రాళ్ళకంటిస్తాయి

కొన్ని చేతులంతే

నగరాన్ని దాటిపోయిన సూర్యుణ్ణి

వెతికి పట్టుకొచ్చి

ఒక్కో ముఖద్వారానికీ అప్పజెప్పి చీకటిలోకి వెళ్ళిపోతాయి

---

**<u>ప్రత్యేక ప్రశంస - రు. 4,000 ల బహుమతి పొందిన కవిత":</u>** వెంకటేష్ పువ్వాడ, బెంగళూరు , కర్ణాటక

"ఒకే లీల-రెండు సిత్రాలు"

నిర్బంధ నగర అద్దంలోంచి

ఉన్నపళంగా ఊడిపడ్డ ఊరి ఆనవాలు నేను!

కాలం యాదిచేస్తే సోదికొచ్చి

సిటీ బస్సు ఇరుకుల్లోంచి, ఉరుకుల్లోంచి,బ్రతుకు గతుకుల్లోంచి ఎర్రబస్సు జ్ఞాపకాల పడిలో తడిలో పల్లె బస్సెక్కాను

స్కైవేలాంటి వాగు బ్రిడ్జీ! స్వాగత అవగతంలో

కాల గమనంలో నగరం ఛాయాలోకి మళ్ళిన మా ఊరు మనసుకి వింతగా తోస్తుంది

ఫోను కూతల్లోంచి లేచే నేను కోడి కూతల్లోంచి ముందే లేచి మురిసిపోయాను

వేకువ తారల ప్రత్యూష వేల

పొగమంచు పొరల్లోంచి ప్రభాత కిరణాల ప్రవాహంలో కళ్ళాపి ముగ్గుల సిగ్గులు

చుట్టుగుడిసె చూరుకింద అవ్వ చిలికే మజ్జిగ కవ్వంలోంచి మిక్సీ సౌండ్!

ఊదుగొట్టాల నాదస్వరంలో పొగలుపోయే ఉడుకునీళ్ల శబ్దం

గోడవతల గడ్డి వాముల కాడ పొలికట్టెల సంగీతం

రీమిక్స్ చేసిన జస్టిన్ బీబర్ పాప్ మ్యూజిక్ లా మ్యాజిక్ గా వుంది

పిచ్చుకుల కువకువ రవళులు ఎఫ్ఎం పాటల్లా వున్నాయి

సిగ్నళ్ళు లేని ఎర్రజేను తోవల్లో బ్రేకులతో పనిలేని ఎడ్లబండ్ల లైనొకటి సేద్యంలోకి సాగిపోతుంది

ఆవుల కొష్టంలో అమ్మ కనిపించలేదని తలుగు తెంచుకున్న లేగదూడ చెంగు చెంగున ఎగురుతుంటే!సిటీ హారన్లకి దూరంగా ఒక మువ్వల సవ్వడి యదపై చిందేస్తుంది మనసుని ఎగరేస్తుంది

మాలచమ్మ చెట్టు కాడ యూనిఫామ్ లేని పోలీస్టేషన్ లా ఠీవిగా కూర్చున్న రచ్చబండ

అయిదారంతస్తుల కందిగూళ్ళు

వాటి నీడల్లో! పొడ ఎండ మెరుపుల్లో గచ్చకాయలాడే అత్త కూతురు

పట్నం ప్లాస్టిక్ నవ్వు తెలీని ఆమె బిత్తర చూపుల్లోనే కాలం గడిచి పోయింది

ఈవినింగ్ ట్రాఫిక్ లేని సాయంకాలంలోనుంచి

ఊరంతా చీకటి రగ్గు కప్పుకుంది

శరత్కాలపు వెన్నెల బెడ్ లైట్ వెలుగుల్లో మంచమేసుకొని తారల్ని లెక్కేస్తూ ఆలోచనల్లో పడ్డా!

అన్వయించుకొని సమన్వయం చేసుకుంటే

బ్రతుకు తాలూకు నేపధ్యం నగరమైతే!

మనిషి తాలూకు చిత్రం ఊరులా కనిపిస్తుంది

ఆకాశాన్ని వంచే జీ'వనాలిక్కడ'

అంబరాన్ని తాకే కాంక్రీట్ వనాలు అక్కడ

రెండూ మనకి సంబరమే! అని స్థిమ్మిత పడ్డాక

ఫోను కూతల్ని మ్యూట్ చేసి గీపిట్ట సంగీత శ్రవణంలో మునిగిపోయా!

అల జాజిపూల మిద్దె మీద నిద్రలోకి జారిపోయా! ఒదిగిపోయా ! కరిగిపోయా.........!

-----------------------------------------------------------------------------------------------------